www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 27 | ఫిబ్రవరి | 2026 పేజీలు : 8

## అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని వ్యక్తి దారుణ హత్య



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఓ వ్యక్తిని కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన తిరుమలాయపాలెం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని పడమటి తండాలో లునావత్ రామచంద్రు (55) పెద్ద కుమార్తె భర్తను వదిలి పుట్టింటి వద్దనే జీవిస్తుంది. ఆ ఇంటికి సమీపంలో డోర్నకల్ మండలం బోడియా తండాకు చెందిన బానోత్ సాయి నివాసం ఉంటున్నాడు. రామచంద్రు పెద్ద కుమార్తెతో సాయి సన్నిహితంగా ఉండటాన్ని రామచంద్రు గమనించి సాయిని తీవ్రంగా మందలించాడు. గురువారం సాయంత్రం రామచంద్రు ఇంటికి వచ్చిన సాయిని రామచంద్రు మందలించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ సమయంలో సాయి కత్తి తీసుకుని రామచంద్రుని పొడవడంతో రామచంద్రు అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుమలాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



- భయోత్పాత చర్యల వెనుక ఉన్నదెవరు...?
- ఆక్రమణలు, కూల్చివేతల వెనుక బలైన పేదలు

# ఈ కన్నీళ్లకు కారకులెవరు?



వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూముల్లో శిథిలాల మధ్య రోదనలు వినిపిస్తున్నాయి. ఆక్రందన, ఆవేదన, ఆవేశం వారి ముఖాల్లో కనిపిస్తున్నాయి. కన్నీళ్లు ధారాల కారుతున్నాయి. కండ్ల ముందే యంత్రాల దాటికి శిథిలమవుతుంటే గుండెలు అవిసేలా రోదించారు. పసిపిల్లలను ఎత్తుకుని ఎక్కడ తలదాచుకోవాలన్న తల్లుల ఆవేదన, చెమట చుక్కలతో నిర్మించుకున్న ఇంటిని కడసారి చూద్దామని చూసుకోలేక శిథిలాలను చూసి స్పృహ తప్పిన బాధితులు ఎక్కడ ఉండాలో అయోమయ స్థితిలో మూగగా రోదిస్తున్న వృద్ధులను చూసి హృదయాలు బరువెక్కాయి. పరీక్షల సమయం కావడంతో ఎక్కడ చదువుకోవాలి, ఎక్కడి నుంచి పరీక్షకు హాజరు కావాలి అన్న విద్యార్థుల మీమాంస లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించుకున్న ఈ కూల్చివేతల వెనుక కన్నీళ్లకు కారకులెవరు...? ఆక్రమణలు జరుగుతున్నా అప్పుడు పట్టించుకోకుండా చోద్యం చూసి ఇప్పుడు ప్రభుత్వ భూములంటూ కూల్చివేసిన అధికారులు కారకులే. ఎన్నికల సమయాన మౌనం వహించిన నేతలు భాగస్వాములే. పేదల ఆశలను సొమ్ము చేసుకున్న దుర్మార్గులు శిక్షార్హులే. -ప్రజాపక్షం/ఖమ్మం

2లో

## నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



**-డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలి**
**-వామపక్షాలు డిమాండ్**
**-బాధితులకు పరామర్శ.. కలెక్టర్‌కు వినతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పట్టణంలో వెలుగు మట్ల ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతలో నిర్వాసితులైన వారందరికీ వెంటనే పునరావాసం కల్పించాలని, ప్రత్యామ్నాయం నివాసం ఏర్పాటు చేసేంత వరకు పునరావాస కేంద్రాలు నిర్వహించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెలుగు మట్లలోని ఇండ్లను కూల్చడం తొందరపాటు చర్య అని యుద్ధ రంగాన్ని తలపించే రీతిలో పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి భయోత్పాతం సృష్టించాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో ఉన్న వెలుగు మట్ల నిర్వాసితులను పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెలుగుమట్ల ప్రాంతంలో వామపక్షాల నాయకులు పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. వామపక్షల నేతల ముందు బాధితులు తమ గోడు

మిగతా 2లో..

## ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమా..



**-బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేస్తాం**
**-బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్**
**-వెలుగుమట్ల బాధితులకు పరామర్శ**
**-బాసటగా నిలుస్తామని భరోసా**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమేనా పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా పేదలను మెడపట్టి గెంటేయడమేనా అని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కేటిఆర్ ప్రశ్నించారు. అర్ధరాత్రి అరాచకం సృష్టించారని నోటీసులు లేకుండా కూల్చివేయడం ఈ జిల్లాలో ఉన్న

మిగతా 2లో..

# ఈ కన్నీళ్లకు కారకులెవరు..?







**ప్రజాపక్షం/ ఖమ్మం :** జీవితంలో ఒక స్థిర నివాసం ఏర్పరచుకోవాలన్న ఆశ ప్రతి ఒక్కరికి ఉంటుంది. జీవిత కాలంలో ఒక ఇల్లు నిర్మించుకుని ఆ ఇంట్లో తనివి తీరా కునుకు తీయాలన్నది దురాశ కాదు అది గుడిసైనా మరెదైనా సొంత ఇల్లు సొంత ఇల్లే. సొంత స్థలం, సొంత ఇంటి కోసం ఆశపడటం దురాశ కాదు. ఎవరైనా మీకు నివాస స్థలం చూపిస్తామంటే సానుకూలంగా స్పందించని వారు ఉండరు. వెలుగు మట్ల భూదాన్ భూముల విషయంలోనూ అదే జరిగింది. రెక్కాడితే కానీ డొక్కడని పేదలు పట్టణాలలో అద్దెలు చెల్లించలేక కుంటో, అరకుంటో దొరికితే అందులో తలదాచుకునేందుకు ఒక గూడును నిర్మించుకోవాలన్న ఆశతో వెలుగుమట్ల వైపుకు వచ్చారు. 1951లో వినోబాబావే భూదానోద్యమం సందర్భంగా వెలుగుమట్ల రెవెన్యూలోని సర్వే నెం. 147, 148, 149 లో 31.20 ఎకరాలు భూ యజమానులు భూమిని దానంగా ఇచ్చారు. అయితే ఇది సాగుకు లాకి అయిన భూమి కాకపోవడంతో రైతులకు పంపిణీ జరగలేదు. ఇందులో పది ఎకరాల భూమిని ప్రభుత్వ విద్యా సంస్థల నిర్మాణానికి కేటాయించారు. మిగిలిన 21.20 ఎకరాలు ఖాళీగా ఉంది. చింతకాని మండలంలోని కొందరికీ భూదానోద్యమం సందర్భంగానే కేటాయించారని ఆ రైతులు సైతం అప్పట్లో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారు. తర్వాత రైతులు పట్టించుకోలేదని సమాచారం. ఈ 20 ఎకరాల భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. కొన్ని పక్కా ఇండ్లు కూడా నిర్మించుకున్నారు. ఆరు నెలల పాటు ప్రభుత్వ యంత్రాంగం ఆవైపు కన్నెత్తి చూడక పోవడంతో అక్కడికి వచ్చే పేదల సంఖ్య క్రమేపి పెరిగింది. గడిచిన ఎనిమిదేళ్లలో సుమారు 600 మంది పేదలు అక్కడకు చేరుకున్నారు. వినోబానగర్ పేరుతో కాలనీని నిర్మించుకున్నారు. ఎనిమిదేళ్ల పాటు అధికారులు, అధికార పార్టీ నేతలు స్పందించక పోవడం అప్పుడప్పుడు కాస్త హడావుడి చేసినా మళ్లీ వినోబా నగర్ వైపు చూడక పోవడంతో తమ ఇండ్ల వద్ద ఉన్న కోద్దో గొప్పో ఆస్తిని అమ్ముకుని తల తాకట్టు పెట్టి ఇండ్లు నిర్మించుకున్నారు. ఇప్పుడు శత్రు దేశాన్ని ఆక్రమించుకునే సమయంలో సైన్యాన్ని మోహరించినట్లు వేల మంది పోలీసులు మోహరించి గంటల వ్యవధిలో నేలమట్టం చేశారు.

**అప్పుడే స్పందించి ఉంటే :**

భూదాన్ భూములను ఆక్రమిస్తూ గుడిసెలు వేయడం నేరమని రెవెన్యూ అధికారులకు తెలిసి ఎందుకు మౌనం వహించారన్న ప్రశ్నకు ఇప్పుడు సమాధానం చెప్పాల్సి ఉంది. తొలినాళ్లలోనే ప్రభుత్వ భూ ఆక్రమణ తప్పని గుడిసెలను తొలగించి ఉంటే వేల మంది పేదలు ఇంత పెద్ద మొత్తంలో నష్టపోయే అవకాశమే ఉండేది కాదు. అధికార యంత్రాంగం మౌనంగా ఉండడంతో పేదలు ఈ భూమి తమకు దక్కుతుందిలే అన్న భావనకు వచ్చారు. పైరవీకారులు పేదల నుంచి సొమ్ము దోచుకోవాలన్న భావనలో ఉన్నవారు పేదలను కొంత మభ్యపెట్టిన మాట వాస్తవం. అదే సందర్భంలో పేదలకు ఈ భూమిపై హక్కు సాధించాలని న్యాయస్థానాల చుట్టూ తిరిగింది వాస్తవమే. కానీ గుడిసెకు ఇంత, 50 గజాలకు ఇంత అంటూ లెక్కలు కట్టి పేదలను దోచుకున్నారు. ఇది కూడా సత్యమే. తొలుత అధికారులే అడ్డుకుని ఉంటే ఇంత పెద్ద మొత్తంలో పేదలు నష్టపోయే వారు కాదు. ఈ భారీ మొత్తంలో నష్టపోవడానికి సొంత గూటిలో తలదాచుకోవాలన్న పేదల ఆశ దానికి మించి అధికారుల నిర్లక్ష్యం కారణం.

**ఆశలను సొమ్ము చేసుకున్న బ్రోకర్లు :**

పేదల ఆశలను సొమ్ము చేసుకున్నారు. న్యాయస్థానాల పేరుతో వెళ్లేందుకు కొంత, జాగా కేటాయించినందుకు కొంత ఇలా పెద్ద మొత్తంలో వసూలు చేశారు. అయినా సంవత్సరాల పాటు ప్రభుత్వం ఆ వైపు చూడకపోవడంతో ఇక తమకు దక్కుతుందిలే అన్న ఆశలో పక్కా ఇండ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు వాటిని కూల్చివేశారు. కారేపల్లి మాణిక్యారం మండలంకు చెందిన ఓ నిరుపేద కుటుంబం ఖమ్మంలో రోజువారి కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేందుకు వచ్చింది. ఇక్కడ జాగా ఇస్తున్నారని తెలిసి అక్కడి వారిని కలిసి 50 గజాల స్థలం పొందారు. దానిలో రేకులతో నివాసం ఏర్పరచుకున్నారు. రెండేళ్లుగా అక్కడే ఉంటూ నగరంలో పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. ఇంటికి తెచ్చిన మూడు లక్షల రూపాయల అప్పు తీరక ముందే ఇల్లు మంగళవారం నేల మట్టమైంది. కామేపల్లి మండలానికి చెందిన ఓ నిరుపేద ఇటీవల రూ. 50వేలు చెల్లించి అందులో స్థలం పొందాడు. చిన్న గుడిసె వేసుకుని జీవిస్తున్నాడు.అధికారుల దెబ్బకు గుడిసెలో జీవించాలన్న ఆయన ఆశ ఆవిరైపోయింది. ఇలాంటి అభాగ్యులు ఎందరో అక్కడ స్థాయికి మించి వెచ్చించి నిరాశ్రయులయ్యారు. ఈ అధికారుల మౌనం, నేతల అధికార కాంక్ష నడుమ పేదల ఆశలు సమీ దలయ్యాయి.



**గతం మాదిరే ప్రత్యామ్నాయం చూపాలి :**

గతంలో ఖమ్మం నగరంలో నాగార్జున సాగర్ కాలువ కట్టల పైన, గోళ్లపాడు కాల్వ కట్టల పైన పేదలు ఇండ్లు నిర్మించుకుని చాలా కాలం జీవించారు. వివిధ కారణాలతో ప్రభుత్వం ఇండ్లను తొలగించింది. ఎన్నెస్పీ కాలువ కట్టలపై ఉన్న వారికి పువ్వాడ ఉదయ్ నగర్ వద్ద రఘునాథపాలెం మండలంలో నివాస స్థలాలను కేటాయించింది. అదే రీతిలో గోళ్లపాడు కాలువ బాధితులకు వైఎస్ఆర్ నగర్ సమీపంలో నాగార్జున సాగర్ కాలువ పక్కన నివాస స్థలాలను కేటాయించారు. ఇప్పుడు కూడా వెలుగు మట్ల నిర్వాసితులకు నివాస స్థలాలను కేటాయించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ప్రత్యామ్నాయం చూపి తొలగించి ఉంటే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత కనిపించేది కాదు. కనీసం వినోబా నగర్‌లో ఎవరు జీవిస్తున్నారు, వారు పేదలేనా ఎక్కడి వారు, అందులో అర్హులైన వారు ఎంత మంది అన్న కనీస సమాచారం సేకరించకుండానే కూల్చివేతలు జరిపారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు పునరావాసం పై దృష్టి సారించాలి. వామపక్షాలు డిమాండ్ చేసినట్లుగా అదే స్థలంలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి అర్హులకు ఇవ్వాలి.

## ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమా..

(మొదటిపేజీ తరువాయి)



మంత్రులకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. గురువారం వెలుగుమట్లలో ప్రభుత్వం భూదాన్ భూముల్లోని ఇండ్లను కూల్చివేయడంతో నిరాశ్రయులైన వారిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసన మండలి సభ్యులు, జిల్లా అధ్యక్షులు తాతా మధు తదితరులతో కలిసి పరామర్శించారు. ఖమ్మం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో బాధితులను పరామర్శించి ఓదార్చారు. వెలుగుమట్లలో శిథిలమైన ఇండ్లను పరిశీలించారు. పలువురు బాధితులతో కేటిఆర్ మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటిఆర్ మాట్లాడుతూ వెలుగుమట్లలో కాంగ్రెస్ అరాచకం సృష్టించిందని ఆరోపించారు. బాధితుల వద్ద అన్ని రకాల ధృవీకరణ పత్రాలు ఉన్నా ఎందుకు కూల్చివేశారని ఆయన ప్రశ్నించారు. బాధితుల వద్ద న్యాయస్థానం నుంచి వచ్చిన అనుమతులు, భూదాన్ బోర్డు పత్రాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఖమ్మం ఆర్డివోను బదిలీ చేయడం ద్వారా తప్పును కప్పిపుచ్చుకోవాలని ఈ ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కూల్చివేతకు గురైన కుటుంబాలకు అండగా నిలుస్తామని కేటిఆర్ హామీ ఇచ్చారు. బాధితులను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని ఐక్యంగా ఉంటేనే తిరిగి హక్కును పొందగలమని ఆయన స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు వరకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. శాసనసభలోనూ శాసన సభ వెలుపల వెలుగుమట్లలో నిరాశ్రయులైన పేదల కోసం పోరాడతామన్నారు. రెండేళ్లలో కేసిఆర్ ముఖ్యమంత్రి కానున్నారని మీకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వడం తథ్యమని కూల్చివేసిన చోటనే ఇండ్లు నిర్మిస్తామని కేటిఆర్ భరోసా ఇచ్చారు. ముగ్గురు మంత్రులు ఉండి పేదల గురించి పట్టించుకోలేదని వందలాది మంది నిరాశ్రయులై రోదిస్తుంటే కనీసం పరామర్శించారా అని కేటిఆర్ ప్రశ్నించారు. ఇది కూల్చివేతల ప్రభుత్వమని హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో కూల్చివేస్తున్నారని మహబూబాబాద్, ఖమ్మంలోనూ పేదలే లక్ష్యంగా కూల్చివేతలు జరిగాయన్నారు. కేసిఆర్ ప్రభుత్వంలో మాత్రమే పేదలకు న్యాయం జరుగుతుందని అన్ని విధాలా ఆధుకుంటామని కేసిఆర్ చెప్పిన మాటలను మీకు చెప్పేందుకే ఖమ్మం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్. ప్రవీణ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు, బానోత్ చంద్రావతి, బానోత్ హరిప్రియా నాయక్, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)



వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూమిలో ఆశ్రయం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న 600 కుటుంబాలకు సంబంధించిన రెండు వేల మంది జీవిస్తున్నారని వారందరికి ఎటువంటి హెచ్చరికలు లేకుండా బుల్‌డోజర్లతో విరుచుకుపడి కూల్చివేశారని ఇది ఒక అమానుష ఘటన అని వామపక్షాల నేతలు తెలిపారు. యంత్రాలతో కూల్చివేతలు జరిగాయని పిల్లలు, వృద్దులు, మహిళలు అనే విచక్షణ లేకుండా బయటకు గెంటివేశారని వారు తెలిపారు. అంతే కాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేశారని వారు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఇండ్ల కూల్చివేతకు గురైన కుటుంబాలకు ఎటువంటి షరతులు లేకుండా అదే స్థలంలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తిరిగి వసతి కల్పించేంత వరకు నిర్వాసితులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శులు దండి సురేష్, నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీతామహలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, సాంబశివారెడ్డి, తాటి నిర్మల, గాదె లక్ష్మినారాయణ, శ్రావణ్, చింతల రమేష్, సిపిఎం నాయకులు మాచర్ల భారతి, వై. విక్రం, యర్రా శ్రీనివాస్, మాస్‌లైన్ నాయకులు సివై పుల్లయ్య, వై. ప్రకాష్, శిరోమణి, ఝాన్సీ, వివిధ పార్టీల నాయకులు బషీర్, మస్తాన్, శ్రీకాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పాం సాగు లాభదాయకం

**-జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఆయిల్ పాం సాగు లాభదాయకమని జిల్లా ఉద్యాన అధికారి ఎంవి మధుసూదన్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని చింతగుర్తి గ్రామంలో కేతినేని సీతారాములు ఆయిల్ పాం తోటలో రైతులకు ఆయిల్ పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ మాట్లాడుతూ సాంప్రదాయ పంటలైన మిర్చి, వరి, పత్తి పంటలు కాకుండా ఆయిల్ పాం పంటను రైతులు సాగు చేయాలన్నారు. ఆయిల్ పాం ఒకసారి నాటితే 30 ఏళ్ల పాటు ఆదాయాన్ని ఇస్తుందని కోతుల బెడద తక్కువగా ఉంటుందని, ప్రకృతి వైపరీత్యాల నుండి తట్టుకుంటుందన్నారు. మార్కెట్ సదుపాయం కలిగి ఉన్న పంట అని ఎకరానికి రూ.1.50 లక్షల నికర ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం నుండి కూడా ఎకరానికి రూ. 51వేలు రాయితీ ఇస్తుందన్నారు. ఈ సదస్సులో ఉద్యాన పరిశోధన స్థానం అశ్వారావుపేట కు చెందిన శాస్త్రవేత్త ఎం. శ్రీనివాస్, అగ్రోనామిస్ట్ సుబ్బారావు, ఆయిల్ పాం పంటలో ఎరువుల యాజమాన్యం, చీడ, పీడల యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమ్మిని మౌనిక, ఉద్యాన అధికారి నగేష్, గోద్రెజ్ మేనేజర్ రామకృష్ణ, హెచ్ఈవో జరీనా, ఫీల్డ్ ఆఫీసర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో కృత్రిమ మేథ పాత్రపై వర్క్ షాప్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కృత్రిమ మేథ వైద్య రంగం పనితీరును పూర్తిగా మార్చివేసిందని ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గురువారం ఎస్‌బిఐటి కళాశాలలో వైద్య రంగంలో కృత్రిమ మేథ పాత్రపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో పాల్గొని గుండాల కృష్ణ మాట్లాడుతూ వైద్య పరీక్షలలో, ఇమేజ్ అనాలసిస్, రోబోటిక్ సర్జరీ, రోగ నిర్ధారణ పరీక్షల వంటి వాటిలో ఆధునీక సాంకేతిక సహాయాన్ని కృత్రిమ మేథ అందిస్తుందన్నారు. వర్క్‌షాపుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ డా॥ ప్రమోధ పాత్రో మాట్లాడుతూ కొత్త ఔషధాల తయారీలలో గతంలో జరిగిన జాప్యాన్ని కృత్రిమ మేథ ద్వారా త్వరగా అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకు రాగలమన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా రోగికి తక్కువ సమయంలో, తక్కువ నష్టంతో త్వరగా కోలుకునే అవకాశాన్ని ఏఐ అందిస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్ అండ్ మిషన్ లెర్నింగ్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై మక్కువతో పాటు వినియోగంపై అవగాహన కలిగిస్తుందని తెలిపారు. వివిధ ఎక్స్‌రేలు, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, పాథాలజీ రిపోర్ట్‌లను విశ్లేషించి ఖచ్చితమైన వైద్యాన్ని సూచించడంలో ఏఐ ఉపయోగపడుతుందన్నారు. వ్యక్తి ఆరోగ్య పరీక్షలు, వ్యక్తిగత అలవాట్లను సేకరించి జన్యుపరంగా సంక్రమించే వ్యాధులను ఏఐతో గుర్తించవచ్చునని కళాశాల వైస్ ఛైర్మన్ కె.శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఏఐ ప్రస్తుతం వ్యక్తి ధరించే వస్తువు రూపంలో మనిషిలో అంతర్భాగమైందని తెలిపారు. రక్తపోటు, ఆక్సిజన్ లెవల్స్ వంటి నిరంతర డేటాను సేకరించి విశ్లేషించడంలో ఏఐ పాత్ర అద్భుతమని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ డా॥ ప్రమోధ పాత్రోను కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్ఓడి డా॥ కె. స్ఫూర్తి, వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ ఎ. మల్లికార్జున్ పాల్గొన్నారు.

# రక్తదాతలు రియల్ హీరోలు

**-రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ సమాజానికి నిజమైన రియల్ హీరోలు అవుతారని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ సంస్థ వి లవ్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను రక్షించే మహోత్తర సేవలో భాగస్వామ్యం కావడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ సమాజానికి నిజమైన రియల్ హీరోలు అన్నారు. వేసవి కాలంలో సాధారణంగా రక్తదానం చేసే వారి సంఖ్య తగ్గుతుందని ఇలాంటి సమయంలో కూడా సేవా సంస్థ ముందకు వచ్చి శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.ఒక యూనిట్ రక్తాన్ని ప్లాస్మా ప్లేట్‌లెట్స్ రక్తంగా విభజించి ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని తెలిపారు. ఈ శిబిరంలో 122 మంది రక్తదానం చేశారు.





ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చందునాయక్, హెచ్‌వోడి సందీప్, సంబంధిత అధికారులు, సేవా సంస్థ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం భాషా పేపర్ 1 పరీక్షకు జనరల్, ఒకేషనల్ కలిపి 16,829 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16,525 మంది విద్యార్థులు హాజరయ్యారు 304 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రవిబాబు పరిశీలించారు. ఎక్కడ మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన తెలిపారు.

# మధిరలో సేఫ్ తల్లి పిల్లల హాస్పటల్ ప్రారంభం







**ప్రజాపక్షం/ మధిర :** మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సేఫ్ తల్లి పిల్లల హాస్పటల్‌ను సీనియర్ వైద్యులు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాతరామనాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లల వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా మధిరలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలతో సేఫ్ తల్లి పిల్లల హాస్పటల్ ప్రారంభించిన నిర్వాహకులు డాక్టర్ కంచేటి సాయికిషోర్, డాక్టర్ మండవ తేజస్విని అభినందించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా హాస్పటల్ ఆవరణంలో రామనాథం చేతులమీదుగా మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం గురువారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేశారు. ఆమె ఇంటిని నిర్మించి గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ సిద్దిఖ్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఏఈ శిరీష, నాగమణి, రఫీ, మల్లయ్య, గోపి, ఇస్మాయిల్, శివ పాల్గొన్నారు.

# మెకానిక్‌కు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్ బ్రహ్మాచారికి ఆర్థిక సాయం అందజేశారు. ఖమ్మంలో 25 ఏళ్లుగా మెకానిక్‌గా పనిచేస్తున్న తట్టుకునూరి బ్రహ్మాచారి గత నెలలో రోడ్డు ప్రమాదంలో కాలు ఫ్రాక్చర్ అయింది. వైద్యులు 40 రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. బ్రహ్మాచారి పరిస్థితిని తెలుసుకున్న యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు యూనియన్ తరుపున రూ. 10వేలు నగర సహాయ కార్యదర్శి గడ్డం లాలయ్య, ప్రచార కార్యదర్శి తూము సత్యం చేతుల మీదుగా బ్రహ్మాచారికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు మెకానిక్ కుటుంబాలకు రూ.11.50 లక్షలు అందించడం జరిగిందన్నారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగిన మెకానిక్‌లకు యూనియన్ ఎల్లవేళ ల అండగా ఉంటుందని తెలిపారు. మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం పని చేస్తుందని కొండలరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగులమీరా, యర్రోజు నరేష్, ప్రచార కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ సమయంలో దాచుకున్న సొమ్మును వెంటనే విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు (పెన్షనర్లకు) ఉద్యోగ సమయంలో దాచుకున్న నగదును వెంటనే విడుదల చేయాలని పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) తెలిపారు. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (పిఆర్‌పిఏ) ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న పెన్షనర్లకు పిఆర్‌పిఏ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం జరిగిన పిఆర్‌పిఏ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైవి మాట్లాడుతూ పెన్షనర్లకు ఉద్యోగ సమయంలో దాచుకున్న నగదును వెంటనే విడుదల చేసి వారిని సమస్యల నుండి విముక్తి పొందెలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ విరమణ పొంది 20 నెలలు కావస్తున్నా పెన్షనర్లకు గ్రాట్యూటి, కమ్యుటేషన్, జిపిఎఫ్, జిఐఎస్ ఇవ్వకపోవడం వల్ల పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మనోవేదన చెందుతున్నారన్నారు. పిఆర్‌సిని వెంటనే ప్రకటించి, డిఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎం. సీతారామయ్య, వి. జగన్‌మోహన్‌రావు, జివిస్ నారాయణ, కొండలరావు, కొత్తా శ్రీనివాసరావు, దండ గురవయ్య, ఎం. చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం

**రంగంలోకి 9వ వార్డ్ కౌన్సిలర్ జగన్నాధం**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని 9వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో గత కొన్ని రోజులుగా నెలకొన్న నీటి సరఫరా సమస్య స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ముఖ్యంగా ఉదయం వేళల్లో నీటి సరఫరా లేకపోవడంతో గృహిణులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ నిత్య కృత్యాలలో అంతరాయం ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో 9వ వార్డ్ కౌన్సిలర్ జగన్నాధం శ్రీను స్వయంగా రంగంలోకి దిగి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం విశేషంగా నిలిచింది. కాలనీలోని ప్రధాన పైప్‌లైన్‌లో ఏర్పడిన లోపం కారణంగా నీటి ప్రవాహం నిలిచిపోయినట్లు గ్రహించారు. విషయం తెలిసిన వెంటనే కౌన్సిలర్ శ్రీను సంఘటనా స్థలానికి చేరుకుని మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిస్థితిని సమీక్షించారు. పనులు ఆలస్యం కాకుండా ఉండేందుకు స్వయంగా తానే బురద గుంటలోకి దిగి మరమ్మతు చర్యలను వేగవంతం చేశారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి స్వయంగా వచ్చి పనులు చూసుకోవడం అభినందనీయమని కాలనీ వాసులు కౌన్సిలర్ శ్రీనుకి కృతజ్ఞతలు తెలిపారు. కొంతకాలంగా చిన్నపాటి లీకేజీలు, ఒత్తిడి సమస్యలు ఉన్నప్పటికీ వాటిపై సరైన శ్రద్ధ లేకపోవడం వల్లే పెద్ద సమస్యగా మారిందని కాలనీ వాసులంటున్నారు. కౌన్సిలర్ జగన్నాధం శ్రీను మాట్లాడుతూ.. "నీటి సమస్య ప్రజలకు అత్యవసరమైనదని, తక్షణమే పైపులైన్ మరమ్మతులు పూర్తి చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా కాలనీలోని నీటి నిల్వ ట్యాంకులు, వాల్వ్ వ్యవస్థలపై సమగ్ర పరిశీలన చేపట్టి అవసరమైన అప్‌గ్రేడేషన్ చేయనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ అంటే కాలర్ ఎగరేసి తిరగటం కాదని, ప్రజల కష్టాలలో పక్కన నిలబడి పరిష్కారం చూపటమేనని నిరూపించారు కౌన్సిలర్ జగన్నాధం శ్రీను. పేదల మనిషిని ఎన్నుకుంటే ఏం జరుగుతుందో నూతన కౌన్సిలర్ ప్రజలకు కనివిప్పు కలిగేలా ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచారు.

## ఘనంగా శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో 24వ వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారి 24వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారికి పంచామృత అభిషేకాలు ఘనంగా నిర్వహించగా, అనంతరం కు పూజ, సింధూర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు జై శ్రీరామ్ జైజై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అలాగే రాబోయే మార్చి 27వ తేదీన జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూడా భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు.

## పాత గంగారంలో అంగన్వాడీ కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** పాత గంగారం గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ చైతన్య, పంచాయితీ కార్యదర్శి సునేష్‌తో కలిసి గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహార సరఫరాలపై సమగ్రంగా పరిశీలన నిర్వహించారు. ఈసందర్భంగా చిన్న పిల్లల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు, పప్పు, బియ్యం, ఇతర తినుబండారాలు నాణ్యంగా ఉన్నాయా లేదా అన్న అంశంపై ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. సరఫరా చేసిన వస్తువులను సక్రమంగా వినియోగించి పిల్లల ఆరోగ్యాభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలు, చిన్నారుల్లో రక్తహీనత(అనీమియా)తగ్గించడంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అందుకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సమర్ధవంతంగా వినియోగించాలని అంగన్వాడీ టీచర్‌కు సూచించారు. అదే విధంగా చిన్నారులు ఫ్రీ స్కూల్ విద్యకు వెళ్లే ముందు ప్రాథమిక పదజాలం సరిగ్గా పలకగలిగేలా శిక్షణ ఇవ్వాలని టీచర్లకు సూచించారు. పిల్లలో ప్రారంభ దశలోనే విద్యా నైపుణ్యాలు పెంపొందించడంపై దృష్టి పెట్టాలని కోరారు.

## పోలీస్‌ల సమక్షంలో అటవీ శాఖ అధికారులకు రేసింగ్ పావురం అందజేత



**ప్రజాపక్షం/మణుగూరుః** చెన్నై ప్రముఖ పావురాల రేసింగ్ క్లబ్ సొసైటీ ఆధ్వర్యంలో ట్యాగ్ తో ఈ రేసింగ్ పావురాన్ని మహబూబాద్ జిల్లాలో వదిలారు. వదిలిన ప్రాంతం నుండి స్వయంగా ఈ పావురం యజమాని ఇంటికి తిరిగి వెళుతుంది. వదిలిన అనంతరం రేసింగ్ పావురాల ఫలితాలు విడుదల చేస్తారు. రేసింగ్ పోటీలో పాల్గొన్న ఈ పావురం మణుగూరు సింగరేణి గనిలో దాహం కోసం దిగగా పట్టుబడింది. సింగరేణి అధికారులు వెంటనే ట్యాగ్ తో కూడిన పావురాన్ని పోలీస్‌ల సమక్షంలో అటవీ శాఖ అధికారులకు అందించారు. ఈ పావురాన్ని వదిలేయడం వల్ల చెన్నై యధా స్థానానికి వెళ్లే అవకాశం ఉంది.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం



**ప్రజాపక్షం/పాల్వంచ :** డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు సాగుతామని కార్పోరేషన్ పాల్వంచ 41 డివిజన్ సిపిఐ కార్పోరేటర్ గొర్లె అన్నపూర్ణ అన్నారు. గురువారం డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్మికులతో కలిసి రహదారులు, వీధుల్లో తిరిగారు. డ్రైనేజీలలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని గమనించారు. చెత్తను తొలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చటానికి ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో కృషి చేస్తామన్నారు. డివిజన్‌లో ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ ఇష్టారీతిన రహదారులు, డ్రైనేజీలలో వేయరాదన్నారు. ప్రతీరోజు వచ్చే చెత్త సేకరణ వాహనంలో వేయాలని సూచించారు. మనమంతా చేయీ చేయీ కలిపి 41వ, డివిజన్‌ను ఆదర్శంగా తీర్చి దిద్దుకొందామని పిలుపునిచ్చారు. నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించటానికి పాటు పడతానని చెప్పారు.

## శ్రీ చైతన్యలో కేరియర్ ఆఫ్టర్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు పంచాయతీ పరధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో కేరియర్ ఆఫ్టర్ ఇంజనీరింగ్ అనే అంశంపై గురువారం ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన తరువాత విద్యార్థులు ఎంచుకోవాల్సిన మార్గలు, పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, సాఫ్ట్ స్కిల్స్, అభివృద్ధి, కార్పొరేట్ రంగం అవకాశాలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ రంగ ఉద్యోగాలపై సమగ్ర చర్చ జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ మోటివేటర్ డాక్టర్ కౌస్త్యా ఆగస్త్యా_రాజ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సాయిగీతిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి నారాయణ, డీన్ డాక్టర్ వి. సుదర్శన్, టిపిఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ఎలక్ట్రికల్ విభాగం అధిపతి కృష్ణప్రసాద్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఆలయ ప్రతిష్ఠామహోత్సవం

**- ఆలయ నిర్మాణ దాతను అభినందించిన సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**







**ప్రజాపక్షం/పాల్వంచ :** శిధిలమైన, అతి పురాతనమైన కాకతీయుల నాటి శ్రీ మోక్ష వెంకటేశ్వరస్వామిఆలయాన్ని కాకతీయుల వైభవాన్ని చాటిచెప్పే విధంగా సొంత ఖర్చులతో పునరుద్దరించిన శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్‌రెడ్డి, దంపతులు అభినందనీయులని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. గురువారం ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠామహోత్సవానికి కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ చైర్మన్ మూడ్ గణేష్‌తో హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆలయ విశిష్టతను తెలుకొన్నారు. అత్యంత ప్రాచీతమైన గొప్ప చరిత్ర కలిగిన ఆలయాన్ని పునరుద్దరించి అందుబాటులోకి తేవటం గొప్ప వరమన్నారు. పాల్వంచ గుడిపాడు గ్రామంలో 1219 1313 మద్యకాలంలో కాకతీయుల రాజు ప్రతాపరుద్రునిచే ఆలయం నిర్మించినట్లు చరిత్ర తెలుపుతున్నది. ఆనాటి రోజుల్లో నిత్యదీపారాధనతో పాటుగా విశేష పూజలను జరిపేవారు. కాలక్రమేణ ఆలయం శిధిలమై పోయింది. అనంతరం 2011 సంవత్సరంలో పాల్వంచలో తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన మస్తాన్‌రావు గుడిపాడు గ్రామ సందర్శనకు వెళ్ళారు. ఈ క్రమంలో శిధిలమైనపోయిన ఆలయాన్ని గుర్తించి గ్రామస్తులను అడిగి తెలుసుకొన్నారు. వెంటనే వారి సహకారంతో ఆలయాన్ని, ఆలయ పరిసరాలను శుభ్రం చేయించి అర్చకులతో దూపదీప నైవేద్యాలతో పాటుగా పూజాకార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆలయ విశిష్టత నల్లా సురేష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సొంత ఖర్చులతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ నేతృత్వంలో ఆలయ పుర్నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. కోటికి పైగా సొంత నిధులతో కాకతీయుల కాలంనాటి ఆనవాళ్ళను చెరిగిపోకుండా ఆద్యాత్మిక శోభను ఉట్టిపడేలా ఆలయ పునప్రతిష్టించారు. ప్రతిష్టా మహోత్సవాలను ఈ నెల 21 నుండి 26 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజు వేలాదిగా తరలివచ్చిన భక్తులు, అర్చకుల వేద మంత్రాలతో గ్రామం మొత్తం ఆద్యాత్మికతను సంతరించుకొంది. ఆలయం నందు శ్రీదేవి, గోదాదేవి సమేత శ్రీ మోక్ష వెంకటేశ్వరస్వామి వారి ధృవమూర్తులు, శ్రీదేవి వరాహ స్వామివారు, గరుడాళ్వార్, విస్వక్సేన, ద్వార పాలకులు, వకుళాదేవి, జీవద్వజ, శిఖర యంత్ర ప్రతిష్ఠామహోత్సవాలను మంగళవాయిద్యాలు, వేదపారాయణులు, నిత్యహోమాలు, చతుష్ఠానార్చన, ప్రాణాధిదశ, వాయున్యాస హోమాలు, మహా పూర్ణాహుతి, ఆలయములలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వాచనము, పీఠన్యాసం, గర్తన్యాసం, రత్నన్యాసము, ధాతున్యాసనము, ఓషధీన్యాసము తదితర ప్రత్యేక పూజలతో అర్చకులు వేద మంత్రాలన నడుమ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గోవింద నామాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. అనంతరం సాయంత్రం 6 గంటల నుండి శ్రీ ఉదేవి, గోదాదేవి సమేత శ్రీ మోక్షవెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్, మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నరసయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్, రజనీకుమారి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, ఆరెం ప్రశాంత్, పాల్వంచ ప్రముఖులు, భక్తులు వేలాది మంది పాల్గొన్నారు.

# బూర్గంపాడులో ఆధ్యాత్మిక వైభవం

**-శివాలయంలో ప్రతిష్ఠా మహోత్సవాలు**
**-నేడు ప్రధాన ప్రతిష్ఠ**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి వారి దేవాలయం(శివాలయం)లో నూతన ధ్వజస్తంభం(జంట నాగేంద్ర), బలిపీఠం, శ్రీ లక్ష్మీ గణపతి, బాలత్రిపుర సుందరి దేవతల ప్రతిష్ఠా మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ త్రయాహ్నిక మహోత్సవాలు 25 నుండి 27(నేటి)వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఫాల్గుణ మాస శుక్ల ఏకాదశి పర్వదినమైన ఫిబ్రవరి 27వ(నేడు)శుక్రవారం ఉదయం 11గంటల 34 నిమిషాలకు పునర్వసు నక్షత్ర యుక్త వృషభ లగ్న పుష్కరాశం సుముహూర్తంలో యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. రెండో రోజైన గురువారం ఉదయం 6గంటలకు యాగమండపం దేవతల అర్చనలు, హోమాలు కొనసాగాయి. ధ్వజస్థంభం, విగ్రహమూర్తులకు పంచామృతాధివాసం, జలాభిషేకం చేశారు. మహిళలచే సామూహిక కుంకుమార్చన భక్తి ఉత్సాహాల మధ్య జరిగింది. అనంతరం గ్రామోత్సవంగా విగ్రహమూర్తుల ఊరేగింపు నిర్వహించారు.

### ప్రతిష్ఠాచార్యుల ఆధ్వర్యంలో...

ఈ మహోత్సవాలను ఆదిశంకరా చార్య వేద ధర్మపీఠ వ్యవస్థాపకులు, సహస్రాధిక ప్రతిష్ఠాచార్యులు అందరంగా చార్యులు, వాస్తు జ్యోతిష్యాగమ పండితులు బ్రహ్మ శ్రీ పడకండ్ల వెంకటాచార్య గురుకుల్ హైదరాబాద్ శిష్యులు, పురోహిత బ్రహ్మ, సహస్త శివలింగ ప్రతిష్ఠాచార్యులు బ్రహ్మశ్రీ కనసాని నూతనా చార్యులు(శైవాగము పండితులు) బూర్గంపాడు వారి ప్రధాన ఆధ్వర్యంలో, వాస్తు జ్యోతిష్య పురోహితులు అరిందల యశ్వంత్ శర్మ(శైవాగము పండితులు) పాల్వంచ పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

### నేడు ప్రధాన ప్రతిష్ఠ...

శుక్రవారం ఉదయం 6గంటలకు యాగ మండప దేవతల అర్చనలు, హోమాలు, అనంతరం 11:34గంటలకు ధ్వజస్థంభం, విగ్రహ మూర్తుల యంత్ర ప్రతిష్ఠ జరగనుంది. పూర్ణాహుంతి, శాంతి కళ్యాణంతో కార్యక్రమాలు ముగియనున్నాయి. మధ్యాహ్నం 1గంటకు అన్నదన కార్యక్రమం నిర్వహించనున్నారు.

### దాతల సేవలు...

ధ్వజస్థంభ దాతలుగా బొల్లు రమేష్, స్వరాజ్యం దంపతులు సేవలందిస్తున్నారు. అన్న ప్రసాద దాతలుగా దుద్దుకూరి నరేంద్ర, రాణి దంపతులు సేవ చేస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహోత్సవాలకు గ్రామ ప్రజలు, భక్తులు భారీగా హాజరై ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

# కంకర పోశారు.. రోడ్డు వేయడం మరిచారు..!

**-ప్రాణపాయ స్థితిలో ప్రయాణం**
**-పట్టించుకోని ఓ గుత్తేదారు..**
**జాప్యం చేస్తున్న మరో గుత్తేదారు**





**ప్రజాపక్షం/పెనుబల్లి:** పైకి తేలిన రాళ్ళతో భయం భయంగా వాహనదారులు ప్రయాణించాల్సిన పరిస్థితి. ఎప్పుడూ ఏమి జరుగుతుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిందే.... వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని లంకాసాగర్ క్రాస్‌రోడ్ నుండి ముత్తగూడెం వరకు రహదారి కంకరు తెలి గుంతలు మయం అయింది. బాగున్న తారు రోడ్డు ను రెండు సంవత్స రాల క్రితం తవ్వి కంకరు పోసి వదిలేశారు. కాంట్రక్టర్ నిర్లక్ష్యం తో పనులు కుంటు పడుతున్నాయానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ఇద్దరు గుత్తేదార్లు మారారు 2018లో రహదారులు భవనముల శాఖ ముత్తగుడెం నుండి లంకాసాగర్ వరకు రోడ్డు నిర్మాణం కొరకు సీఆర్ యఫ్ సెంట్రల్ నిధులతో సుమారు రూ. 11 కోట్లతో ఆంధ్ర ప్రాంతానికి చెందిన గుత్తేదారు సుమారు11 కిలోమీటర్లు టెండరు 25 శాతం లెస్ కు దక్కించుకున్నారు. పనులు ప్రారంభించి బిల్లులు కావటం లేదని అట్టి పనులు చేయటం మానేసి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుండి ఈ రహాదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టు కొని ప్రయాణించాల్సిందే. నిత్యం లంకాసాగర్ క్రాస్ రోడ్డు మీదుగా వందలాది మంది వాహనదారులు, వందలాది మంది పాదచారులు వెళుతుంటారు. రోడ్డుపై గుంతలు తప్పించబోయి చాలా మంది ప్రమా దాల బారినపడిన సంఘటనలు అనేకం ఉన్నాయని గ్రామస్తులు తెలి పారు. మరికొందరు ప్రాణాలు సైతం పొగొట్టుకున్నారు. కాలక్రమేణా ఆ రోడ్లు పట్ల పట్టించుకున్న నాదుడే కరువయ్యారు. లంకసాగర్ క్రాస్ నుండి ముత్తగూడెం గ్రామాల మధ్య దూరం 11 కిలోమీటర్లు, అయినా ప్రయాణం పూర్తి కావాలంటే గంటన్నరకు పైగా పడుతుం దంటే రోడ్డు ఏ పరిస్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయినా అధికా రుల్లో చలనం లేదు. మీ చావు మీరు చావండి అన్నట్లు వ్యవహరిస్తూ రోడ్డు మరమ్మ తులను పట్టించు కునేవారే కరువయ్యారు. ఈ రోడ్డుపై ప్రయాణించే లంకాసాగర్, సూరయ్యబయిర్, పాత కారాయిగూడెం, కోంద్రుపాడు, కందిమళ్ళబంజర్, మర్లకుంట, ముత్తగూడెం తదితర గ్రామాల ప్రజలు రోడ్డు దుస్థితిని తలచుకుంటూ అధికారులపై దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రజలు ఎంత గగ్గోలు పెట్టినా గుత్తేదారు చేతులెత్తేసిన తరువాత అధికారులు సైతం మళ్ళీ టెండర్లు పిలవటం కానీ వేరే గుత్తేదారు కి పనులు అప్పగిం చటం కానీ జరగలేదు. ఇది అధికారులు ప్రజాపతినిధుల నిర్లక్ష్యం అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా 2022 లో లంకాసాగర్ నుండి మండాలపాడు క్రాస్ రోడ్డు వరకు నాలుగు కిలోమీటర్లు రోడ్డు వెడల్పు పేరుతొ మరో గుత్తేదారు రెండు కోట్లతో టెండరు దక్కించుకొని బిల్లులు రావటం లేదని పనులను పట్టించు కోలే దనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తంగా బిట్లు వారీగా ఓరోడ్డు ఆరు ఏళ్ళు కావస్తుండగా, మరో బిట్టు రోడ్డు రెండు ఏళ్ళు నుండి రోడ్డు పని నత్త నడకసాగుతుంది. రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపో యాయి. పనులన్నీ ఎక్కడికక్కడ ఆగిపోవ డంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు వాహనాదారులు గుంతలలో పడి కాళ్ల చేతులు విరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనా దారులు రోడ్డు పై తేలిన కంకరు రాళ్ళతో వాహానాలరు పంక్చర్లు పడి ఆరోడ్డు పై నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్డు వెడల్పు కోసం మంచిగా ఉన్న రోడ్డు ను తవ్వి రోడ్డుపై కేవలం కంకర వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్రవాహ నాలు అదుపుతప్పి బోల్తాపడుతున్నాయి. ఈ రోడ్డు పనులు పూర్తి చేయ డంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన రోడ్ పనులను పూర్తి చేయా లని వాహనదారులు కోరుతున్నారు. కాలక్రమేణా అధికారులు మారారు. ప్రజాప్రతినిధులు మారారు. కానీ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తికాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కల్పిం చుకుని రోడ్డు పనులు పూర్తిచేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతు న్నారు. 2018లో టెండరు దక్కించుకున్న గుత్తేదారు పట్టించుకోవటం లేదని ఉన్నతధికా రులకు నివేదికలు పంపామని, లంకాసాగర్ నుండి మండాలపాడు డ్రాస్ రోడ్డు వరకు టెండరు దక్కించుకున్న గుత్తేదారు ను హెచ్చరించారు.

# చంద్రుగొండను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతా : జారే



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** చంద్రుగొండ మండలాన్ని విద్యా హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని పోకలగూడెం, బెండలపాడు, గుర్రాయిగూడెం, తుంగారం, చంద్రుగొండ, దామరచర్ల, గానుగపాడు గ్రామ పంచాయితీలలో ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా కళ్యాణ లక్ష్మీ షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రుగొండ మండలానికి రూ 9.78 కోట్ల నిధులతో వివిధ పనులకు ఎకారం చుట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళల సాధికారతకు ప్రాధాన్యతం ఇస్తూ ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతుకలు ఉపయోగపడే విధంగా గోదాములు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బెండలపాడు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. చంద్రుగొండలో ఆధునిక గ్రంథాలయ నిర్మాణానికి రూ 20లక్షల మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఈకార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మీ, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బోజ్యా నాయక్, సర్పంచులు కుంజా వెంకటేశ్వర్లు, గోవింద్‌రెడ్డి, ఇస్లావత్ రుక్మిణి, కాశీ విశ్వనాథం, ఇంజి అప్పారావు, బొర్రా సురేష్, మహేష్, ఇమ్రాన్ అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచిలో సమాచార హక్కు చట్టం అమలుపై ప్రశ్నార్థకం..?

**-50 రోజులు గడిచినా సమాచారం అందక దరఖాస్తుదారులు ఆగ్రహం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలో సమాచార హక్కు చట్టం అమలు తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం హక్కు చట్టం యాక్ట్ 2005 ప్రకారం 30 రోజుల్లోగా సమాచారాన్ని అందించాల్సి ఉండగా, కూసుమంచి మండల తహసీల్దార్ కార్యాలయంలో జనవరి ఒకటి 2026న దాఖలైన దరఖాస్తుకు 50 రోజులు గడిచినా స్పందన రాకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. మండలంలో పలువురు మైనర్ బాలికలకు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీపై సంబంధిత వివరాల అంశాలపై లోతైన సమగ్రమైన సమాచారం కోరుతూ పలువురు పౌరులు దరఖాస్తులు సమర్పించినట్లు తెలుస్తోంది. అయితే గడువు దాటినా సంబంధిత అధికారుల నుండి ఎలాంటి సమాచారం అందకపోవడంతో దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం ఇవ్వడం ప్రభుత్వ అధికారుల బాధ్యత. చట్టబద్ధంగా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాచారం ఇవ్వకపోవడం వెనుక నిర్లక్ష్యమా...?లేక ఉద్దేశ పూర్వక ఆలస్యమా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టం ప్రకారం నిర్ణీత గడువులో సమాచారం అందించకపోతే అప్పీల్ దాఖలు చేసే హక్కు పౌరులకు ఉందని న్యాయవేత్తలు సూచిస్తున్నారు. అవసరమైతేపై అధికారులను ఆశ్రయించి, సమాచార హక్కు కమిషన్‌ను సంప్రదిస్తామని దరఖాస్తుదారులు తెలుపుతున్నారు. ఈ అంశంపై మండల తహసీల్దార్ కార్యాలయం నుండి అధికారిక స్పందన రావాల్సి ఉంది. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి దృష్ట్యా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని చట్టబద్ధంగా సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రజక సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రం లో రజక సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి గ్రామంలోని అన్ని కులాల ప్రజల సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య నాయకత్వంలో జరిగింది. ఈసందర్భంగా రేసు ఎల్లయ్య మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా ఉమ్మెర గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో చోటు చేసుకున్న దారుణ ఘటనను ఖండించారు. జాతరకు వెళ్లిన రజక(చాకలి)కులానికి చెందిన కుటుంబాన్ని టికెట్ విషయంలో జరిగిన వాగ్వాదం తరువాత దాడి చేయడం జరిగిందని తెలిపారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు వేడుకున్నప్పటికీ అక్కడి నిర్వాహకుల్లో ఒకరు రెండు నెలల పసి పాపను కాలితో తన్నడంతో ఆ చిన్నారి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆరోపించారు. తాము తక్కువ కులానికి చెందిన వారమని అవమానిస్తూ, కుల అహంకారంతో ప్రవర్తించడం అమానుషమని, పసిపాప ప్రాణం పోవడానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి కుల వివక్ష, దుహంకార సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రజక సంఘం నిర్వహించిన ఈ ర్యాలీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. ఆళ్లపల్లి బస్టాండ్ సెంటర్ నుండి భగత్‌సింగ్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, మృతి చెందిన చిన్నారికి నివాళులర్పించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని దుబ్బతండా గ్రామానికి చెందిన భూక్య శ్రీనివాసరావు ఇటీవల గుండెపోటుతో అకాల మృతి చెందాడు. కూలి పని చేసుకుని జీవించే శ్రీనివాసరావుకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. దుబ్బతండా గ్రామంలో గురువారం శ్రీనివాసరావు సంతాప సభను కుటుంబ సభ్యులు నిర్వహించారు. శ్రీనివాసరావుతో పాటు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలిసి విద్యను అభ్యసించిన మిత్రులు బానోత్ బాబూ రూ 5వేలు, బానోత్ కుమార్ రూ 1500లతో పాటు మిగతా మిత్రులు తమకు తోచినంత ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతకు ముందు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం చెప్పారు. కార్యక్రమంలో తోటి మిత్రులు శివాజీ, భావుసింగ్, వీరన్న, కుమార్, అనిల్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల కేంద్రంలో గల వైరా నియోజకవర్గస్థాయి తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనపరిచారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కే సుజాత, ఎం అక్షిత, బీ కరుణలు ఈనెల 22, 23వ తేదీలలో తమిళనాడులోని చెన్నై జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన అశ్మిత కేలో ఇండియా రబ్బీ లీగ్ పోటీలలో కాంస్య పతకాన్ని సాధించారు. అదే విధంగా వీరు ప్రాతినిధ్య వహించిన జట్టుకు రూ 48వేల ప్రోత్సాహక బహుమతిని కూడా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి గురువారం కారేపల్లికి చేరుకున్న వారి ముగ్గురికి స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మండల విద్యాశాఖాధికారి జయరాజు, పాఠశాల ప్రిన్సిపల్ దారా సావిత్రిలతో పాటు పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆ విద్యార్థులతో పాటు పీడీ జారే అనుష, పిఈటి నాగేంద్రమ్మలను సన్మానం చేసి పాఠశాల సాంప్రదాయ పద్ధతితో కూడిన ర్యాలీగా పాఠశాల వరకు తీసుకువెళ్లారు.

## పేదల ఉసురు తీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల గ్రామ సమీపంలో భూదాన్ భూముల్లో సుమారు పది సంవత్సరాల క్రితం 800 కుటుంబాలు గృహాలు నిర్మించుకొని జీవినం సాగిస్తున్న వారి ఇండ్లపై అర్ధరాత్రి బుల్డోజర్‌లతో వచ్చి కూల్చివేయటం దారుణమని బిజేపి జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంటేశ్వర్లు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భూదాన్ భూముల్లో గత ప్రభుత్వాల హయాంలలో అధికారులే ఇంటి నెంబర్లను, విద్యుత్, తాగునీటి వంటి మౌళిక సౌకర్యాలను కల్పించారని తెలిపారు. ఆనాడు అక్రమమని చెప్పని అధికారులు వేలాది మంది పోలీసులతో వచ్చి పేదల ఇండ్లను ఎలా కూల్చి వేసారని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ, దేవాలయ, అసైన్డ్ భూములను ఆక్రమించిన పెద్దలను వదిలిపెట్టి పేదల ఇండ్లను కూలగొట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కోల్పోయిన ప్రతీ ఒక్కరికి నష్ట పరిహారంతో పాటుగా పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. లేనిచో పేదల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లింగగిరి వెంకటరామయ్య, మాలోత్ ప్రశాంత్, సిహెచ్. శేఖర్, కొత్తపల్లి విజయ్, బానోత్ బాలాజి, సిహెచ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# సేవాభావం అభినందనీయం, అనుసరణీయం

**-ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి : వైరా ఏసిపి సారంగపాణి**





**ప్రజాపక్షం/బోనకల్ :** సేవాభావం అభినందనీయం, అనుసరణీయమని ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని వైరా ఏసిపి ఎస్. సారంగపాణి సూచించారు. ఎక్కడ ఉన్న తాము పుట్టిన గ్రామాలను మరిచిపోకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం, వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వడం అలవర్చుకోవాలని ఆయన సూచించారు. రాపల్లి గ్రామంలో చావా రవి శంకర ప్రసాద్ తన సతీమణి వెంకట లక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్యూరీఫైర్ వాటర్ ప్లాంట్‌ను గురువారం సారంగపాణి ప్రారంభించారు. గ్రామంలో ప్రజలకు ప్యూరీఫైర్ వాటర్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సారంగపాణి మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పన జరిగితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. తమకున్న దానిలో ఇతరులకు సాయం అందించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. నిర్వహణ ఖర్చుతో త్రాగునీటిని అందించాలని భావించి ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని పోటీ అనివార్యమైనప్పుడు పోటీపడి ఆ తర్వాత గ్రామాభివృద్ధి కోసం ఒకే గొంతుకగా నిలవాలని ఏసిపి సూచించారు. చిన్న గ్రామాలు ఐక్యతతో మెలిగినప్పుడే అభివృద్ధి చెందుతాయని ఘర్షణలు అభివృద్ధిని కుంటుపరుస్తాయన్నారు. యువత ఆదర్శంగా నిలవాలని వ్యసనాలకు దూరంగా మసులుకోవాలని ఆయన కోరారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ లక్ష్య సాధన దిశగా పనిచేయాలని ఏసిపి సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర సిఐ మధు, బోనకల్ ఎస్ఐ వెంకన్న, ప్లాంట్ నిర్వహకులు చావా రవి శంకర ప్రసాద్, వారి కుటుంబ సభ్యులు రాధాకృష్ణ, గ్రామ సర్పంచ్ తాళ్లూరి వెంకట్రావమ్మ, టియుడబ్ల్యూ జె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు ఏనుగు గాంధీ, ఏనుగు జనార్ధన్, మందడపు చంద్రశేఖర్‌రావు, ప్రభాకర్‌రావు, స్టాలిన్, ఉప సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హనుమకు 'ఆత్మీయ సత్కార్'

**-సైన్స్‌లో సృజనాత్మక బోధనకు దక్కిన పురస్కారం**
**-కొణిజర్ల పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం**







**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొణిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బి హనుమకు " ఆత్మీయ త్కార్ " పురస్కారం లభించింది. తన సృజనాత్మక బోధనా పద్ధతులతో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆసక్తిని రేకెత్తిస్తున్న ఆయనకు ఈ అరుదైన గౌరవం దక్కింది. సైన్స్‌పట్ల చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర స్థాయిలో " గాంధీ సరస్వతి సన్మాన్ " సంస్థ వారు ఉపాధ్యాయుడు హనుమను " ఆత్మీయ సత్కార్ 2020 " పురస్కారంతో సత్కరించారు. హర్యానా, కోలకత్తాలలో జరిగిన వివిధ ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ టీచర్ వర్క్ షాప్‌లో పాల్గొని ఉపాధ్యాయ బోధన మెళుకువలు అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. వీరి మార్గదర్శకంలో ఇన్‌స్పైర్‌లో ఒక ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. గత రెండు సంవత్సరాలలో ఈ పాఠశాలనుంచి ఇన్‌స్పైర్ లో రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్టులు, సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయికి ఒక ప్రాజెక్టు ఎంపికైంది. ఆంధ్ర తెలంగాణ జోన్ స్థాయిలో జరిగిన జిజ్ఞాస సైన్స్ ఎగ్జిబిట్‌లో రెండు ప్రాజెక్టులు ఎంపికై విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులకే కాకుండా సమాజానికి రైతులకి, శ్రామికులకి ఉపయోగపడే విన్నూత్న పరికరాలైన లేబర్ స్టాండ్ ఆటోమేటిక్ ఫ్లల్లిషింగ్ టాయిలెట్, మల్టీపర్పస్ స్ప్రెడెర్, తెలంగాణ ఇన్నోవేషన్స్ వారు నిర్వహించే ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపికై మూడు అవార్డులు సాధించాయి. ఇందులో ఒక పరికరం పేటెంట్ టైప్ కొరకు ప్రయత్నంలో ఉంది. మూడు సార్లు గ్రామీణ ఇన్నోవేషన్ అవార్డులు స్వీరించాయి. సైన్స్ పట్ల వీరు చేస్తున్న కృషిని గుర్తించి హైదరాబాద్‌లోని గాంధీ సరస్వతి సల్మాన్ సంస్థ వారు వీరిని ఆత్మీయ పురస్కార్ 2020తో వీరిని సత్కరించారు. పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలే కాకుండా సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను పారదోలడానికి మిరాకిల్ ఎక్సో కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

# ఏసు మార్గం అనుసరణీయం

**- మానవత విశ్వాస సమాజము వ్యవస్థాపకులు మోజేష్‌చౌదరి**
**- ఆటోనగర్‌లో ఘనంగా నూతన మందిర ప్రతిష్ఠాపన**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏసు మార్గం అనుసరణీయమని మానవత విశ్వాస , సమాజము , వ్యవస్థాపకులు గుళ్లపల్లి మోజేష్‌చౌదరి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ 30వ వార్డులోని ఆటోనగర్‌కాలనీలో నూతనంగా నిర్మాణం చేసిన జీసస్ క్రైస్ట్ మందిర ప్రతిష్ఠాపన గురువారం ఘనంగా జరిగింది. తొలుత దైవ సందేశకులు, విశ్వాసుల నడుమ ఆలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ...యూట్యూబ్,సోషల్‌మీడియాలతో అసత్య ప్రచారాలను చేస్తూ ఓ పక్క క్రిస్టియానిటీ, దైవజనులపై అనేక ఆరోపణలు చేస్తుండటం బాధాకరమన్నారు. ఏసు మార్గం ఎంతో అత్యున్నత కలిగి ఉన్నదని, ఈ మార్గంలో ఉండి పాపములకు పాల్పడితే కచ్చితంగా దేవుని ముందు శిక్షింపబడతారన్నారు. అంతేకానీ అసత్య ప్రచారాలు, రాజకీయ వ్యాఖ్యలతోనో ఖ్యాతిని తగ్గించలేరన్నారు. ఆ దేవుడు చూపిన విధంగానే శాంతి సేవా భవాన్ని తప్పకుండా పెంపొందిస్తామన్నారు. దేవుడు మీద మనం ఉంచుకునే విశ్వాసమే ఉన్నతంగా జీవించేలా చేస్తుందని ఉద్ఘాటించారు. నూతన చర్చ్ నిర్మాణం చేసిన ఫాస్టర్ చల్లగుండ్ల రమేష్‌బాబును అభినందించారు. ఈ ఆలయం విశ్వాసులతో జ్ఞానాన్ని బోధించే కేంద్రంగా కీర్తించబడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దైవ సందేశకులు ఎం బిషప్ జాకబ్, ఏర్పుల ప్రభాకర్‌రావు, కె. సాల్మన్‌రాజు, ఎనోష్‌కుమార్, సిరిగిరి యోహాన్, ఎం రవికుమార్, ఇ. భాస్కర్, బీవీ రత్నం, పాల్ సంజీవరావు, ఎలీషా శ్రీనివాస్, బి. పాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కౌన్సిలర్లు దండి రంగారావు, దండి శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు శుభ్రతకు అందరం కలిసికట్టుగా ముందుకు పోదాం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ నాగ్లో వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి గురువారం వార్డులో చెరువు బజార్ చేపల కాలనీలో బావిలో ఉన్న చెత్త మున్సిపాల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం చెరువు బజార్ ఇరువైపులా ఉన్నటువంటి డ్రైనేజీలో వ్యర్థాలను జెసిబితో మున్సిపాల్ సిబ్బంది తొలగించే విధంగా కౌన్సిలర్ శ్రావణి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్ మాట్లాడుతూ వార్డు ప్రజలు డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవాలని వ్యర్థ పదార్థాలను మున్సిపాలిటీ వామనాల్లోనే వేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా వార్డులో ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని వేముల శ్రావణి రత్నాకర్ తెలిపారు.

# కడవరకు కమ్యూనిస్టుగానే చక్రపాణి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు ఎర్రజెండా కోసం పోరాడిన చక్రపాణి ధన్యజీవని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం ఖమ్మం రూరల్ మండలంలో దారేడుగ్రామంలోని స్మారక స్థూపం వద్ద 7వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉమ్మడి దారేడు గ్రామ సర్పంచ్‌గా పని చేసి ఈ ప్రాంతంలో సిపిఐ బలోపేతానికి చేసిన సేవలను కొనియాడారు. యువత ఆయను ఆదర్శంగా తీసుకొని పార్టీ బలోపేతానికి సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎంపిటీసి ఎన్నికల్లో సిపిఐ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. దారేడులో సర్పంచ్‌గా ఏకగ్రీవం కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, జిల్లా సమితి సభ్యులు బత్తిని సీతరాములు, గ్రామ సర్పంచ్ బత్తిని వెంకటేశ్వర్లు, గ్రామ సహాయకార్యదర్శి నూర్‌పాషా, నాయకులు జిలానీ, మీరా తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ సభ్యురాలు మృతి

**- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29వ డివిజన్‌కు చెందిన సిపిఐ సీనియర్ సభ్యురాలు వెంపటి అన్నపూర్ణమ్మ(95) అనారోగ్యంతో గురువారం ఇంటి వద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలికి కొడుకు, కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు సన్మానం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌ని ప్రజాపక్షం ఉమ్మడి జిల్లా బ్యూరో ఏనుగు వెంకటేశ్వరరావు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌కు ఏనుగు వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగు గాంధి, మందడపు స్టాలిన్, పులి కృష్ణార్జున్‌రావు, డేవిడ్ పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత





**ప్రజాపక్షం/మధిర :** క్షయ వ్యాధి నిర్మూలన ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని ఖమ్మంపాడు సర్పంచ్ బట్ట అంజన్‌బాబు అన్నారు. మధిర మండలం ఖమ్మంపాడు గ్రామంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు ఉన్న వారికి దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం సాయంత్రం జ్వరం రావడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటాయని, ఈ లక్షణాలు ఉన్న వారు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు తెమడ పరీక్ష, ఎక్స్రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృధ్వీరాజ్ నాయక్, సీనియర్ చికిత్స పర్యవేక్షణలు సందీప్, శివ, ఉపేందర్, ఉప సర్పంచ్ ఉషారాణి, గ్రామ కార్యదర్శి అర్చన, టిబి నోడల్ పర్సన్ కొండయ్య, హెచ్‌వి సుబ్బలక్ష్మి, వడ్లమూడి వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామపంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని పంచాయతీరాజ్ డిప్యూటీ కమీషనర్ ఎం విద్యాలత పేర్కొన్నారు. గురువారం చింతకాని మండల పరిషత్‌లో జరుగుతున్న వార్డు సభ్యుల శిక్షణా తరగతులకు ఆమె హాజరై మాట్లాడుతూ వార్డు సభ్యులు విధిగా తమ వార్డులో సమస్యలు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకువచ్చి సమావేశంలో తీర్మానాలు చేసి గ్రామాభివృద్ధిలో పాత్ర పోషించాలన్నారు. విధిగా గ్రామ పంచాయతీ సమావేశాలకు హాజరై గ్రామాభివృద్ధి, సమస్యలపై దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు మెరుగైన వసతులు కల్పించాలి

-సివిల్ సప్లయిస్ అధికారికి సమస్యలు వివరించిన సిపిఐ బృందం
-జిల్లా అధికారి నుండి సానుకూల స్పందన లభించింది : సాబీర్ పాషా



ప్రజాపక్షం/కొత్తగూడెం: జిల్లా పరిధిలోని సివిల్ సప్లయిస్ విభాగం, వేర్ హౌస్ గోడౌన్లలో పని చేస్తున్న హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా నేతృత్వంలో జిల్లా సివిల్ సప్లయిస్ అడిషనల్ మేనేజర్ మహేష్‌కు వినతి పత్రం సమర్పించారు. సమస్యలను అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ గోడౌన్లలో కార్మికులకు కనీస సౌకర్యాలైన రెస్ట్ షెల్టర్లు, సైకిల్ షెడ్లు అదే విధంగా మరుగుదొడ్లు లేక హమాలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఎగుమతి, దిగుమతి రేట్లను వెంటనే పెంచాలని కోరామని తెలిపారు. కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి వీటిని త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని సాబీర్ పాషా తెలిపారు. సమస్యలు పరిష్కారం కానిపక్షంలో ఆందోళనలు చేపడతామని, అవసరమైతే సమ్మె బాట పడతామని అన్నారు. ప్రతినిధి బృందంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి గెద్దాడు నగేష్‌తో పాటు హమాలీ కార్మిక సంఘం నాయకులు రాములు, రమణయ్య, దాము, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఎంఎల్ఏ పాయం పర్యటన



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని రామచంద్రపురం గ్రామ పంచాయితీ పరిధిలోని సత్యనారాయణపురం కాలనీలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ పాయం మాట్లాడుతూ పేదలకు సొంతింటి కల నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కుటుంబం సురక్షితమైన గృహంలో నివసించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన గుగులోత్ వీరన్న అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అక్కడ నుండి మొండికుంటలోని పంచకట్టు వేడుకలకు హాజరై చిరంజీవిలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ వీరన్న ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో సీడీపీవో రేవతి, ఎంపీడీవో ముత్యాలరావు, హౌసింగ్ డిఈ సబయ్ రామ్, ఏపీవో సీతా రామయ్య, ఏఈ ఉదయ్ కుమార్, టీఎస్ ఎన్పీడీసీఎల్ సబ్ ఇంజనీర్ మణిదీప్, మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్కు య్య, సీనియర్ నాయకులు ఓరుగంటి రమేష్ కుమార్, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు




ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సును ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం కొండపల్లి రవీందర్ రెడ్డి పామాయిల్ క్షేత్రంలో రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ డి.సుజాత పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా పామాయిల్ సాగు చేసే రైతులు పాల్గొని వచ్చిన శాస్త్రవేత్తల ద్వారా సులభతరంగా ఆయిల్ ఫామ్ సాగు మెలకువలు తెలుసుకున్నారు. పామాయిల్ సాగు వల్ల రైతులకు జరిగే లాభాలను వివరించారు. పామాయిల్ సాగుకు బిందు సేద్యం ఎంతో సులభతరంగా ఉంటుందని పామాయిల్ సాగులో అంతర్గత పంటలు కూడా సాగు చేసుకోవచ్చని వివరించారు. పామాయిల్ సాగుకు కోతుల బెడద కూడా తప్పుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నా రెడ్డి, సీతారామరెడ్డి, ఉద్యాన పరిశోధనా కేంద్రం అశ్వారావుపేట ఉద్యాన శాస్త్రవేత్త, డాక్టర్ శ్రీనివాస్, సుబ్బారావు, ఆగ్రోనామిసాత్ ఇండియా, నెటఫిమ్ ఇరిగేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సతీష్, పాలేరు డివిజన్ ఉద్యాన అధికారి పి.అపర్ణ, ఉద్యాన విస్తరణ అధికారి పి.విజయలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారి జి.ప్రదీప్ కుమార్, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ కంపెనీ డివిజన్ మేనేజర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# మేవా కమిటీ ఆర్థికసాయం

-రంజాన్ సందర్భంగా జర్నలిస్టుకు తోడ్పాటు



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్(మేవా)వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని నిరుపేదలకు ఆర్థిక సహాయం అందజేశారు. సారపాక గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి జర్నలిస్టు వృత్తిలో తనదైన శైలిలో వార్తా కథనాలు రాస్తూ ప్రజల మన్ననలు పొందారు. అయితే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా ఆయన మంచానికే పరిమితమయ్యారు. కాగా దివ్యాంగుడు కావడంతో ఏ పని చేసుకోలేని పరిస్థితి దీనికి తోడు ప్రతి నెల ఫిజియోథెరపీకి వేల రూపాయల ఖర్చు అవుతున్నాయని, ఈ విషయం తెలుసుకున్న మేవా కమిటీ సభ్యులు తమ శక్తి మేరకు 6వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా మేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గతంలో కూడా వీరి ఆర్థిక పరిస్థితి గురించి వివిధ వార్తా పత్రికల్లో వార్తలు చదివి ఉన్నామని, వెంకటరెడ్డి వైద్యానికి ఇప్పటికీ లక్ష రూపాయలు ఖర్చు చేశారని తెలిసి, ఈ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మా మేవా కమిటీ తరపున చిన్న సహాయం చేశామని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలతో ముందుకు వస్తున్న మేవా కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఈకార్యక్రమంలో మేవా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తఫా, షేక్ జహీర్ పాషా, కార్యవర్గ సభ్యులు అక్బర్, సోహెల్ పాషా, హఫీజ్, సైదుద్దీన్ పాల్గొన్నారు.

# జితేష్ వి పాటిల్ బదిలీ



ప్రజాపక్షం/ కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్న జితేష్ వి పాటిల్ బదిలీ అయ్యారు. 2024 జూన్‌లో జిల్లాకు వచ్చిన ఆయన తక్కువ కాలంలో పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పేదలు, చిన్న మరియు సన్నకారు రైతుల ఆర్థిక స్వావలంభన కోసం పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ఔషద మొక్కల పెంపకంపై రైతుల్లో అవగాహన కల్పించి, అదనపు ఆదాయం సాధించే దిశగా ప్రోత్సహించారు. పర్యాటక రంగ అభివృద్ధిలోనూ ఆయన చురుకైన చర్యలు చేపట్టారు. గోదావరి నది హారతికి శ్రీకారం చుట్టి భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. అదే విధంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే శ్రీరామ నవమి, ముక్కోటి ఉత్సవాలను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జితేష్ వి పాటిల్ ప్రస్తుతం టీజీ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారు.

**అంకిత్ నూతన కలెక్టర్‌గా నియామకం...**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్‌గా 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అంకిత్ నియమితులయ్యారు. నిజామాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న ఆయనను జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలనా అనుభవంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించే అంకిత్ రాకతో జిల్లాలో మరింత వేగవంతమైన అభివృద్ధి జరుగుతుందని అధికారులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు సూచించారు. మండలం లోని కట్టుకాచారం ప్రభుత్వ పాఠశాలకు వాటర్ కూలర్, గ్యాస్ స్టవ్ ను దాతలు అందించారు. ఈ మేరకు గురువారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతం లో స్థానికులు భాగస్వామ్యం కావటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రవేట్ కు దీటుగా ప్రభుత్వం పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పాఠశాల బలోపేతం కోసం ముందుకు వచ్చిన దాతలు పంచాయతీ ఉప సర్పంచ్ నెల్లూరి మోహన్ రావు, ఏటుకూరి చిన్న పుల్లయ్య లను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, సర్పంచ్ సైదులు, ఉప సర్పంచ్ మోహన్ రావు, మాజీ సర్పంచ్ కోటి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామదాసు, ఇటిక్యాల సురేష్ కుమార్, నారాయణ, అంగన్వాడీ టీచర్ కుమారి, ఆయా భవాని, కార్యదర్శి కిశోర్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన జడ్పి సిఈఓ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖమ్మం జిల్లా పరిషత్ సీఈవో దీక్షా రైనా నేలకొండపల్లి మండలంలో గురువారం పర్యటించారు. మండలం లోని చెరువుమాధారం, రాజేశ్వరపురం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. తొలుత ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశమైయ్యా రు. ఈసీఆర్ కార్యాక్రమాల పై సమీక్షించారు. అనంతరం చెరువుమాధారం పాఠశాలలో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి ప్రగతి ని తెలుసుకునేందుకు టీచర్ గా మారారు. బోర్డు పై అక్షరాలను వ్రాసి, విద్యార్థులతో చదివించారు. పదాలు, వాక్యాలను చదివించారు. వారి తో పాటే నేల పై కూర్చోని విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల సమాధానాలకు మెచ్చుకుని వారికి చాక్లెట్స్ ను అందించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడారు. ఈసీఆర్ కార్యాక్రమాల అమలు పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం ను పెంచాలని సూచించారు. ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కలిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాపక్షం/కారేపల్లి: రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన ప్రయాణం సాగించాలని కారేపల్లి ఎస్ఐ గోపి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలో భాగంగా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న రెండోవ విడత అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో కారేపల్లిలో ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం..మద్యం మత్తు..ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో రహదారులు నెత్తురోడుతుండగా విలువైన ప్రాణాలు కోల్పోయి, బాధిత కుటుంబాల్లో విషాదం అలుముకుంటోందని అన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ జిల్లాలో దృష్టి సారించిందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, సమాజం మొత్తంగా ముందుకు వస్తేనే ప్రమాదాలను తగ్గించగలమని అన్నారు. అరైవ్..అలైవ్ ఒక ఉద్యమంగా మారాలని అన్నారు. ఈకార్యక్రమాన్ని కేవలం ఒక అవగాహన కార్యక్రమంగా కాకుండా, ప్రజా ఉద్యమంగా మార్చాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరులను కూడా ప్రోత్సహిస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు.

# ధిక్కార స్వరం మూగబోయింది : దండి సురేష్




ప్రజాపక్షం/ ఖమ్మం : స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు నల్లకన్ను మృతితో ఓ ధిక్కార స్వరం మూగబోయిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. సిపిఐ కేంద్ర కార్యదర్శి వర్గ మాజీ సభ్యులు, తమిళనాడు గాంధీగా పేరొందిన నల్లకన్ను (101) బుధవారం మృతిచెందిన విషయం విధితమే. గురువారం

**-నల్లకన్నుకు ఘన నివాళి**

స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ యుక్త వయస్సులో భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత కాలంలో కమ్యూనిస్టు పార్టీలో చేరి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. తమిళనాడులో కమ్యూనిస్టు పార్టీని ఒక బలమైన రాజకీయ శక్తిగా మల్చడంతో పాటు పేదల హక్కుల కోసం అనేక మార్లు ఆయన జైలుకు వెళ్లారన్నారు. అసామాన్య పోరాటాలతో తమిళనాడు గాంధీగా ఆయన వినుతికెక్కారని సురేష్ తెలిపారు. ప్రజా పోరాటాల కొనసాగింపే నల్లకన్నుకు సరైన నివాళి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల కమలాకర్, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివ రెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, చింతల రమేష్, ఎస్‌కె సైదా, చానా తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా లింగయ్య



ప్రజాపక్షం/ బోనకల్ : రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం బోనకల్ మండల అధ్యక్షునిగా తోట లింగయ్య, కార్యదర్శిగా భూక్యా వరలక్ష్మి లు ఎన్నికయ్యారు. గురువారం బోనకల్ లో జరిగిన సమావేశంలో డీలర్ల సంక్షేమ సంఘం బాధ్యులను ఎన్నుకున్నారు. కోశాధికారిగా మెరిగ గోపాలరావు, గౌరవాధ్యక్షులుగా గుత్తి సురేందర్, రమేషబాబు ను అసోసియేషన్ సలహాదారుగా నిమ్మతోట సైదమ్మ లను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి 16 మంది హాజరయ్యారు. సభ్యులుగా తన్నీరు నర్సద, తూము పురోషోత్తమరావు, ఎస్‌కె సత్తార్‌మియా, సుందర్‌రావు, గోపి, సతీష్, నాగేశ్వరరావు, రత్నమాల, రత్నకుమారి, సైదమ్మ, శరత్‌బాబు, సుందర్, రమేష్, పద్మ తదితరులు హాజరయ్యారు.

# బాధితులకు భోజన వసతి కల్పించిన ఎంపి వద్దిరాజు



ప్రజాపక్షం/ ఖమ్మం : వెలుగుమట్లలో భూదాన్ భూమిలో ప్రభుత్వం గుడిసెలు తొలగించడంతో నిరాశ్రయులైన 600 కుటుంబాలకు రాజ్యసభ సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు వద్దిరాజు రవిచంద్ర గురువారం భోజనాలు ఏర్పాటు చేశారు. కేటిఆర్ పర్యటన సందర్భంగా పెద్ద సంఖ్యలో బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని కేటిఆర్‌కు తెలియజేసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా వచ్చిన వారందరికీ వద్దిరాజు భోజనాలు ఏర్పాటు చేశారు. దీనితో పాటు నిరాశ్రయులైన వివిధ ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి నీటి సౌకర్యం కల్పించారు. రెండు రోజులుగా సరైన ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న వారికి వద్దిరాజు భోజన వసతి ఏర్పాటు చేయడంతో కాస్త ఉపశమనం పొందారు.

# శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని మండల కేంద్రంలో గల శ్రీచెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సుమారు 500 సంవత్సరాలకు పూర్వమే నిర్మాణమైన చింతకాని శ్రీ భూనీళా సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి అధ్యయనోత్సవం , బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమై మార్చి 4 వరకు ఆరు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించబడతాయని ఆలయ ఈవో చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు తెలిపారు.ఆలయంలో పాంచరాత్ర ఆగమన పద్ధతిలో శ్రీ శేషబట్టర్ రఘునాధా చార్యులు వారి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గురువారం శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం ,తొలక్కం ప్రారంభం, నాలాయిరం, దివ్య ప్రబంధం, అధ్యయనోత్సవం 27 ఏకాదశి శుక్రవారంన సుప్రభాత సేవ, తిరువాయిమొజి సేవాకాలం, విష్ణుసహస్ర నామపారాయణం, తీర్థప్రసాద వినియోగం 28న దివ్య ప్రబంధ పారాయణం బ్రహ్మోత్సవ ప్రారంభ అంకురార్పణ న మార్చి 1త్రయోదశి ఆదివారంన మూర్తి కుంభ స్థాపన , అగ్నిప్రతిష్టాపన, మూలమంత్రహోమం, ధ్వజారోహణః, దేవ ఆహ్వానం, బలిహారణ మార్చి 2 సోమవారం న సుప్రభాత సేవ, ఆరాధన సేవాకాలం చతుస్థాన అర్చనలు, మూలమంత్ర హోమం బలిహారణం, ఎదుర్కోలు రాత్రి 8గంటలకు శ్రీ భూనీళాసమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం మహా అన్నదాన కార్యక్రమం చివరి రోజు గ్రామ సేవ, చక్ర స్నానం, స్వామి వారికి నవకలశస్నపం ఆధ్యాత్మిక , ధార్మిక సేవా కార్యక్రమాలు జరుగును.

**ఉత్సవ కమిటీ నియామకం.**

శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థాన పాలకమండలి గడువు ముగియడంతో నూతన పాలక మండలి ఏర్పాటుచేయకపోవడంతో ప్రభుత్వం బ్రహ్మోత్సవాల కోసం ఉత్సవ కమిటీని నియమించింది. ఉత్సవ కమిటీ సభ్యులు గా గత చైర్మన్ యండపల్లి శ్రీనివాసరావు, కొమ్మిన్ని రామారావు, పెద్దగొండ్ల వెంకటనారాయణ, కొడవకంటి రాంబాబు, తూము భిక్షం, పగిడిపల్లి నవత, బండి తిరపయ్య లను నియమించింది.

**బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి...**
**చుండూరు రామకోటేశ్వరరావు (ఆలయ ఈవో)**

గురువారం నుంచి జరిగే శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలి

# రైతులకు నష్టపరిహారం అందించాలి



ప్రజాపక్షం/ బోనకల్ : గత రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం వలన పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలో అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పొలాలు పూర్తిగా నేలకొరిగిపోయాయని, మిర్చి తోటలు నీటిలో మునిగి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, మందులు వేసి పంటలు సాగు చేశారని, కాని అకాల వర్షం కారణంగా మొత్తం కష్టం వృధా అయిందని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయశాఖ అధికారులతో సమగ్ర సర్వే చేయించి ప్రతి ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు తీర్చలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. అలాగే రైతులకు వెంటనే పంట బీమా మంజూరు చేయాలని, నష్టపోయిన రైతులకు వడ్డీలేకుండా కొత్త పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం కోసం ఈపరిశీలన చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు ఏనుగురవికుమార్, గ్రామ శాఖ కార్యదర్శి ఏనుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు పాటించాలి



ప్రజాపక్షం/ బోనకల్ : రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని వైరా ఏసిపి సారంగపాణి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్య కల్పించాలనే ఉద్దేశ్యంలో బోనకల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ 2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరిగే ప్రమాదాలు, కుటుంబాలపై పడే ప్రభావం, చట్టపరమైన చర్యలు, ప్రాణ నష్టం వంటి అంశాలపై వివరించారు. మద్యం సేవించి వాహనం నడపటం వల్ల క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారి తీస్తుందని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణీకులు సీటు బెల్టు ధరించడం తప్పనిసరని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ వాడకం, సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్ నివారించాలన్నారు. ఎల్లప్పుడూ ఎడమ వైపు ఉంటూ జీబ్రా క్రాసింగ్ ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మధిర రూరల్ సిఐ మధు, బోనకల్ ఎస్సై, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ కేసులో మరో ఆరుగురు అరెస్ట్



ప్రజాపక్షం/సత్తుపల్లి: సైబర్ నేరంలో మోసపోయిన ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 23న సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో భాగంగా, పరారీలో ఉన్న మరో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం ఈ అరెస్టులు జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇప్పటికే ఇదే కేసులో ఈనెల 23 సోమవారం అడపా రామ వెంకట చరణ్ చౌదరి అలియాస్ చరణ్, ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియ తదితరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులు మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్ పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేర్లతో అమాయకులను ఆకర్షించి మోసం చేసినట్లు వెల్లడైందని, బాధితులను టెలిగ్రామ్ గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి, భారీ లాభాల మాయ మాటలు చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. మోసాలకు ఉపయోగించే బ్యాంక్ ఖాతాలు తెరవడానికి నిబంధనలు పాటించకుండా, ఇస్లావత్ లక్ష్మి కల్యాణ్, అతని పరిచయస్తుల ద్వారా ఖాతాలు తెరిపించినట్లు దర్యాప్తులో బయటపడిందని ఈ క్రమంలో 2023లో కేథలిక్ సిరియన్ బ్యాంక్ (సిఎస్‌బి) చంద్రుగొండ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన అఖిల్ అబ్బుల్‌తో సంప్రదించి, కమిషన్ ఇచ్చి ఖాతాలు తెరిపించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 20 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన నిందితులలో ఇస్లావత్ లక్ష్మి కల్యాణ్, భూక్యా తరుణ్, బిల్లా సాయి, తరుణ్, సంగెం ప్రవీణ్ కుమార్, వీరంశెట్టి వంశీ, అఖీల్ అబ్బుల్ లు ఉన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను కలిసిన వార్డు కౌన్సిలర్లు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌ను గురువారం మున్సిపాల్ కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలిసిన 17వ వార్డు కౌన్సిలర్ బత్తుల సుమతి ఏడుకొండలు దంపతులు, 16వ వార్డు కౌన్సిలర్ రాచబండి బలరామయ్య, నారపోగు రవి, మెరుగు వెంకటి వారికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు వార్డులు అభివృద్ధికి సహకరించాలని వారిని కోరారు.





# వైస్ చైర్మన్, కౌన్సిలర్‌కు సన్మానం

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌ను, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ సీతారాములు దంపతులను గురువారం పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నంబూరు రామారావు, గొల్లపూడి సర్పంచ్ మేడూరి రామారావు, లయన్ మెంబర్స్ చింతలపూడి వెంకటేశ్వరరావు, నాళ్ళ నాగేశ్వరరావు, పెనుగొండ ఉపేంద్రరావు తదితరులు ఉన్నారు.

